సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

మంగళవారం । 27 । ఆగస్టు । 2024



అభ్యసన అభివృద్ధే లక్ష్యం

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచేం దుకు విద్యాశాఖ ఆదేశాల మేరకు పాఠశాల ల్లో 'ఎల్ఐపీ'ని అమలు చేస్తున్నారు. - 8లో▸



పాలకుల అండతోనే భూకబ్జాలు

పేదలకు చెందాల్సిన ప్రభుత్వ భూములు పాలకుల కను సన్నల్లోనే కబ్జాలకు గురవు తున్నాయని జీఎల్ఎఫ్ రాష్ట్ర చైర్మన్ నల్లా సూర్య ప్రకాశ్ అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
32.0^0 / 24.0^0

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృ తమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఉంటుం ది. సాయంత్రం పలు ప్రాంతాల్లో చిరు జల్లు లు కురిసే అవకాశం ఉంది.

నేడు 'సాక్షి' ఫోన్ ఇన్



ఎంజీఎం: సీజనల్ వ్యాధులు, డెంగీ, చికున్‌గున్యా ప్రబ లుతున్నాయి. జ్వరాలు పెరి గి ప్లేట్‌లెట్స్ తగ్గి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. జ్వరం నుంచి కోలుకు న్న తర్వాత ఒంటి నొప్పులతో నీర సించి పోతున్నారు. ఈనేపథ్యంలో సీజనల్ వ్యాధులకు వైద్యం, సందేహాలు, వైద్య సలహా ల కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి సూపరిం టెండెంట్ డాక్టర్ మురళితో 'సాక్షి' ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. వైద్యం, వైద్య సలహాలు, సూచనలు పొందడంతోపాటు సం దేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ :
98499 03030
సమయం : నేడు (మంగళవారం)
మధ్యాహ్నం :
2.00 నుంచి
2.45 గంటల వరకు



హనుమకొండ గోకుల్‌నగర్‌లో ఉట్టి కొడుతున్న యువకులు



డి-కన్వెన్షన్‌లో వేషధారణలో చిన్నారులు

కృష్ణా.. ముకుందా.. మురారి

నగరంలోని వేయిస్తంభాల దేవాలయంలో కృష్ణాష్టమి సందర్భంగా 51కిలోల పెరుగన్నంతో రుద్రేశ్వర మహాశివలింగాన్ని శ్రీకృష్ణుడిగా అలంకరించారు. శ్రీభద్రకాళి అమ్మవారిని శ్రీకృష్ణు డిగా అలంకరించి విశేషపూజాధికాలు నిర్వహించారు. హనుమకొండ గోకుల్‌నగర్‌లో ఉట్లు కొట్టే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. యాదవ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గొల్ల - కురుమ సాంస్కృతిక వేడుకల్లో భాగంగా హనుమకొండ హంటర్‌రోడ్‌లోని డి- కన్వెన్షన్ హాల్ లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. - హన్మకొండ కల్చరల్





శ్రీకృష్ణుడి రూపంలో రుద్రేశ్వరుడు, భద్రకాళి అమ్మవారు..

పాతుకుపోయారు!

- బల్దియా అధికారులు, ఉద్యోగులు
- ప్రక్షాళన చేయని ఉన్నతాధికారులు

వరంగల్ అర్బన్: మూడేళ్లకు పైబడిన అధికారులు, ఉద్యోగులను బదిలీ చేయాలని ప్రభుత్వం జారీ చేసిన జీఓ ఉత్తర్వులతో బదిలీల పరంపర కొ నసా గుతోంది. బల్దియాలో నాలుగేళ్ల నుంచి 8 ఏళ్ల వరకు తమ స్థానాలను వదలని అధికారులు, సిబ్బందిని ఉన్నతాధికారులు అంతర్గత బదిలీ చేయడం లేదు. వాస్తవానికి ఏదైనా ఒక విభాగంలో రెండు నుంచి మూడేళ్లకు పైగా పని చేసిన చోట నుంచి మరో సెక్షన్‌కు అంతర్గతంగా బదిలీ చేయాలనే నిబంధన లున్నాయి. కానీ.. గ్రేటర్ వరంగల్‌లో ఇవేమీ పాటించకపోవడం ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అవినీతి, ఆరోపణలున్నా..

బల్దియాలోని ఇంజనీర్లు, పరిపాలన విభాగాల్లో పని చేస్తున్న సిబ్బందిపై పలు అవినీతి, ఆరోప ణలున్నాయి. అయినప్పటికీ వారిని కదిలించేం దుకు ఉన్నతాధికారులు కూడా సాహసం చేయలేక పోతున్నారు. ప్రజాప్రతినిధుల అండదండలే అం దుకు అడ్డంకిగా మారుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అటెండర్ నుంచి సూపరిటిం డెంట్ వరకు, వర్క్ ఇన్‌స్పెక్టర్ నుంచి ఈఈ వరకు, జవాన్ నుంచి శానిటరీ సూపర్‌వైజర్ వరకు ఎవరిని కదిపినా ఎవరో వారి వెనకాల ఉండి అంతర్గత బదిలీకి ఒత్తిళ్లు చేస్తుండడంపై ఐఏఎస్ ఆఫీసర్లు సైతం తలొగ్గుతున్నారనే ఆరోపణలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం శాఖలను ప్రక్షాళన చేయాలని నిర్ణయించిన క్రమంలో స్థానిక సంస్థలు అంత ర్గత స్థాన చలనంపై సందిగ్ధంపై తీవ్ర చర్చ జరు గుతోంది. గ్రేటర్ వరంగల్ పాలక వర్గం పెద్దలు, కమిషనర్ దృష్టి సారించి పలు విభాగాలకు చెం దిన అధికారులు, ఉద్యోగుల ప్రక్షాళన చేస్తే కొం త మేర పరిపాలన, అవినీతి, నిర్లక్ష్యం తదితర అంశాలకు తెరపడనుంది. పాలకవర్గం పెద్దలు, ఉన్నతాధికారుల అంతర్గత బదిలీలపై దృష్టిసా రించాలని బల్దియా అధికారులు, ఉద్యోగుల్లో డిమాండ్ చేస్తున్నారు.



పాతుకుపోయిన ఇంజనీర్లు, ఉద్యోగులు

హనుమకొండ ప్రాంతంలో ఓ డీఈ ఆరేళ్లకు పైగా.. కాజీపేట సర్కిల్‌లోని వడ్డేపల్లి పరిధిలో విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు ప్రజాప్ర తినిధుల అండదండలు పుష్కలంగా ఉండడం వల్ల స్థానచలనం కలగడం లేదనే విమర్శ లున్నాయి. అదే తరహాలో.. నలుగురు వరం గల్, హనుమకొండలో ఏఈలుగా పనిచేస్తు న్నారు. వీరిని కదిలించిన వారే లేరు. బల్దియా ప్రధాన కార్యాలయంలో కాశిబుగ్గ సర్కిల్, కాజీపేట సర్కిల్‌లో ఐదుగురు సూపరిండెంట్లు కొందరు నాలుగేళ్లుగా మరికొందరు ఆరేళ్లుగా సీట్లను వదలకుండా అంటిపెట్టకుని ఉన్నారు. ఆడిందే ఆట పాడిందే పాటగా వ్యవహారాలు కొనసాగిస్తున్నారు. ప్రధాన కార్యాలయం ఇం జనీరింగ్ విభాగంలో ఓ సీనియర్ అసిస్టెంట్‌ను ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా కొనసాగిస్తుండ డంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాశిబుగ్గ సర్కిల్‌లో ఇద్దరు సీనియర్ అసిస్టెం ట్లు, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు, అదే తర హాలో కాజీపేటలో, బల్దియా ప్రధాన కార్యాల యంలో ఇద్దరు ఒకేచోట విధులు నిర్వహిస్తు న్నారు. వీరిని కదలించే నాథుడే కరువయ్యాడు. ప్రజాప్రతినిధులు పరపతి, అధికారుల ఆశీస్సు లు ఉన్నంత కాలం తమను ఎవరూ కదపలేరనే ధీమా వారిలో వ్యక్తమవుతోంది.

మూడు రోజులు.. ఐదు జిల్లాలు

- నేటినుంచి ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి ఓరుగల్లుకు..
- మొదట ములుగు జిల్లాకు.. రాత్రి లక్నవరంలో బస
- పర్యాటక, చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాంతాల్లో పర్యటన
- భారీగా భద్రతా ఏర్పాట్లు
- పరిశీలించిన మంత్రి సీతక్క, కలెక్టర్‌లు, సీపీ, ఎస్పీలు



లక్నవరంలో కలెక్టర్ దివాకరతో కలిసి గవర్నర్ పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క

సాక్షిప్రతినిధి, వరంగల్ : రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఉమ్మడి వరంగల్‌లో పర్యటించనున్నారు. గవ ర్నర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన తొలిసారి ఓరుగల్లుకు వస్తున్నారు. మంగళవారం నుంచి మూడు రోజులపాటు ఆయన పర్యటన కొన సాగనుంది. ములుగు, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లోని పర్యాటక, చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాంతాలను సంద ర్శించనున్నారు. అధికారులతో సమీక్షలు నిర్వహిం చనున్నారు. ఈ మేరకు అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. ఆయా జిల్లాల కలెక్టర్లు, పోలీసు కమిషనర్, ఎస్పీలు, దివాకర టీఎస్,రాహుల్ శర్మ, పి.ప్రా వీణ్య, సత్యశారదా దేవి, షేక్ రిజ్వాన్‌బాషా, అం బర్ కిషోర్ ఝా, శబరీష్‌లు రెండు రోజులుగా ఏర్పాట్లపై అధికారులతో సమీక్షలు నిర్వహించారు. మూడు రోజుల పర్యటనలో ఎలాంటి అవాంఛనీ య సంఘటనలకు తావు లేకుండా పోలీసులు గట్టి భద్రత ఏర్పాటు చేశారు. లక్నవరానికి సోమవారం నుంచే పర్యాటకుల అనుమతిని నిలిపివేశారు. కాగా మొదట మంగళవారం ఉదయం ములుగు జిల్లాకు గవర్నర్ రానున్న నేపథ్యంలో సోమవారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ధనసరి సీతక్క (అనసూయ), కలెక్టర్ టీఎస్ దివాకర, ఎస్పీ శబరీష్‌లతో కలసి రామప్ప దేవాలయం, లక్నవరం హరిత కాటేజీలు, బండ్ సుందరీకరణ ఏర్పాట్ల పనులను పరిశీలించారు.

గవర్నర్ మూడు రోజుల పర్యటన వివరాలు

27న (మంగళవారం)

- ఉదయం 11.30 గంటలకు రోడ్డు మార్గాన రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ములుగు కలెక్టరేట్‌కు చేరుకుంటారు
- మధ్యాహ్నం 12 గంటలకు కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమావేశం
- మధ్యాహ్నం 1 గంటకు రచయితలు, కళాకారు లు, రాష్ట్ర , జాతీయ స్థాయి అవార్డు గ్రహీతలతో కలిసి సహపంక్తి భోజనం
- సాయంత్రం 3 గంటలకు రామప్ప గుడి, రామప్ప సరస్సు, భూపాలపల్లి జిల్లాలోని గణపురం కోటగుళ్ల సందర్శన
- 6:30 గంటలకు లక్నవరంలోని హరిత హోట ల్‌కు చేరుకుంటారు. రాత్రి అక్కడే బస చేస్తారు.

28న (బుధవారం)

- ఉదయం 8 గంటలకు లక్నవరంలోని హరిత రిసార్ట్‌నుంచి హనుమ కొండలోని నిట్ కళాశాల గెస్ట్‌హౌస్‌కు బయలుదే రుతారు
- 9.15 గంటలకు నిట్ గెస్ట్ హౌస్‌కు చేరుకుంటారు.. 9.15 నుంచి 9.45 గం టల వరకు విరామం
- 9.45 గంటలకు నిట్ గెస్ట్ హౌస్ నుంచి బయలు దే రి 10 గంటలకు కలెక్టరే ట్‌కు చేరుకుంటారు.
- 10 నుంచి 11 గంటల వరకు కలెక్టరేట్‌లో వరం గల్ జిల్లా అధికారులతో గవర్నర్ సమావేశం
- 11.05 నుంచి 12.05 గంటల వరకు కలెక్టరేట్‌లో హనుమకొండ జిల్లా అధికారులతో సమావేశం
- మధ్యాహ్నం 12.15 గంటలకు హనుమకొండ, వరంగల్ జిల్లాలకు చెందిన రచయితలు, కళాకారులు, ప్రముఖులు, రాష్ట్ర, జాతీయ అవార్డుల గ్రహీతలతో గవర్నర్ భోజనం చేస్తారు
- 3 గంటలకు ఖిలా వరంగల్, వేయిస్తంభాల దేవాలయం, భద్రకాళి దేవాలయం, పద్మాక్షి దేవాలయం, స్థానికంగా ఉండే ప్రముఖ ప్రదేశా లను గవర్నర్ వీక్షించనున్నారు.
- సాయంత్రం 6.40 గంటలకు తిరిగి నిట్ గెస్ట్ హౌస్‌కు చేరుకుని, రాత్రి బస చేయనున్నారు.



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

29న (గురువారం)

- ఉదయం 9 గంటలకు నిట్ గెస్ట్‌హౌస్ నుంచి రోడ్డు మార్గాన జనగామ జిల్లా కలెక్టరేట్‌కు బయలుదేరనున్నారు.
- 10 గంటలకు జనగామ జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమావేశంలో పాల్గొంటారు
- 11.15 గంటలకు జనగామ కలెక్టరేట్ నుంచి ఓబుల్‌కేశవాపూర్ గ్రామానికి బయలుదేరుతారు
- 11.35 గంటలకు ఓబుల్‌కేశవాపూర్ చేరుకొని రచయితలు, కళాకారులు, ప్రముఖులు, జాతీయ, రాష్ట్రస్థాయి అవార్డు గ్రహీతలతో సమావేశం కానున్నారు. అనంతరం అక్కడే మధ్యాహ్నం భోజనం చేయనున్నారు.
- మధ్యాహ్నం 2.10 గంటలకు ఓబుల్‌కేశవాపూర్ నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా కొలనుపా కకు రోడ్డు మార్గాన బయలుదేరుతారు.

న్యూస్‌రీల్

గ్యారంటీ పెన్షన్ స్కీంపై సంబురాలు



కాజీపేట రూరల్ : రైల్వేకార్మికులకు గ్యారంటీ పెన్షన్ స్కీం వర్తింపునకు కేంద్రం అంగీకారం తెలిపిన నేపథ్యంలో కాజీపేట రైల్వే డీజిల్ లోకోషెడ్ వద్ద సోమవారం రైల్వే మజ్దూర్ యూనియన్ డీజిల్ బ్రాంచీ ఆధ్వర్యంలో నాయకులు, కార్మికులు బాణసంచా కాల్చి సం బురాలు జరుపుకున్నారు. బ్రాంచ్ సెక్రటరీ పాక వేదప్రకాశ్ మాట్లాడుతూ ఇటీవల ప్రధా నమంత్రి నరేంద్రమోదీ, జేసీఎం కన్వీనర్ శివ గోపాల్ మిశ్రా, మెంబర్ శంకర్‌రావుతోపాటు 8 మంది నేతలతో జరిపిన చర్చల సమావేశం లో 2004, జనవరి 1 తర్వాత భర్తీ అయిన కార్మికులకు, నూతన పెన్షన్ విధానంలోని కార్మికులకు యూనిఫైడ్ పెన్షన్ స్కీం ద్వారా రిటైర్మెంట్ సమయానికి తీసుకుంటున్న మూల వేతనంలో 50 శాతం పెన్షన్, డీఏ, గ్యారంటీ పెన్షన్‌గా ఇచ్చేందుకు అంగీకారం తెలిపా రన్నారు. దీంతో ఈ సంబరాలు జరుపుకుంటు న్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ ఎస్.కే.జానిమియా, గిరిమిట్ల రాజేశ్వర్, నరే ష్‌యాదవ్, రవికిరణ్ పాల్గొన్నారు.

బయోమెడికల్‌పై శిక్షణ



కాజీపేట అర్బన్: నిట్‌లో సోమవారం 'అడ్వాన్స్‌డ్ టెక్నిక్స్ ఇన్ బయోమెడికల్ ఇమేజ్ ప్రాసెసింగ్ యూజింగ్ ఆర్టిఫిషియల్ ఇంటె లిజెన్స్' అనే అంశంపై వారం రోజుల ఆన్‌లైన్ శిక్షణను అట్టహాసంగా ప్రారంభించారు. యూ నివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ సౌజన్యంతో అధ్యా పకులకు ఆన్‌లైన్‌లో శిక్షణ తరగతులను అంద జేస్తున్నారు. కార్యక్రమంలో నిట్ మణిపూర్ డైరెక్టర్ డీవీఎల్ఎన్.సోమయాజులు, నిట్ టీచింగ్ అండ్ లర్నింగ్ హెడ్ కిశోర్‌కుమార్, కళాశాలల నుంచి అధ్యాపకులు పాల్గొన్నారు.

మారని 'ఎంజీఎం' తీరు..



ఎంజీఎం: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి తీరు మారడం లేదు. ప్రభుత్వ పెద్దలు, జిల్లా ఉన్న తాధికారులు ఎంత మొత్తుకున్నా.. అధికారు లు నిర్లక్ష్యం వీడడం లేదు.. రోగులకు అవస్థలు తప్పడం లేదు. సోమవారం ఆస్పత్రిలోని ఓ వార్డులో రోగికి సెలైన్ ఎక్కించిన వైద్యులు అం దుకు కనీసం ఒక బెడ్ కూడా కేటాయించలేదు. వార్డు బయటే రోగి బంధువు సెలైన్ పట్టుకుం టే ఇలా కుర్చీలో కూర్చొనే ఎక్కించుకుంటు న్నాడు. ఈ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. దీనిపై ఎంజీఎం అధికారులు ఎలా స్పందిస్తారో చూడాలి.

ఇళ్ల తొలగింపునకు హైకోర్టు బ్రేక్

- పట్టాలు రద్దు చేశాకే.. ఇళ్లు తొలగించాలి..
- మధ్యంతర ఉత్తర్వులు జారీ

వరంగల్ : వరంగల్ నగరంలోని 13వ డివిజన్ చిన్నవడ్డెపల్లి చెరువు పక్కనే ఎంహెచ్‌నగర్ సర్వే నంబర్ 308లో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న పేదల ఇళ్లను తొలగించొద్దని రాష్ట్ర హైకోర్టు మధ్యం తర ఉత్తర్వులు జారీచేసింది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోని అక్రమ నిర్మాణాలను తొలగిం చాలని వినియోగదారుల మండలి ప్రతినిధులు పలుమార్లు కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేయడమే కాకుండా హైకోర్టును ఆశ్రయించారు. దీంతో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న అక్రమ ణలను తొలగించాలని కోర్టు ఆదేశించింది. అప్పటి అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో హైకోర్టు ఆదేశా లను పట్టించుకోక పోవడంతో ఇటీవల వినియోగ దారుల మండలి నాయకులు మళ్లీ కోర్టును ఆశ్ర యించారు. దీంతో సంబంధిత అధికారులపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే సర్వేలు నిర్వహించి అక్రమణలు తొలగించాలని సూచిం చింది. సర్వే చేసిన బృందాలు సుమారు 300మం దికి నోటీసులు జారీ చేయడంతో పాటు కొన్ని ఇళ్లను కూల్చివేసింది. 2003లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తమకు ఇళ్లు నిర్మించుకునేందుకు అసైన్డ్ పట్టాలు ఇచ్చిందని, అదే భూమిలో ఇళ్లు నిర్మించు కుని ఉంటున్నందున కూల్చివేతలకు పాల్పడొద్దని పేదలు అడ్డుకున్నారు. రాజకీయ నాయకుల జోక్యంతో కూల్చివేతలకు విరామం ఇవ్వడంతో పట్టాలు పొందిన లబ్ధిదారులు హైకోర్టును ఆశ్ర యించారు. బాధితుల తరపున వాదనలు విన్న హైకోర్టు ఇళ్ల నిర్మాణం కోసం ఇచ్చిన అసైన్డ్‌మెంట్ పట్టాలను రద్దు చేసిన తర్వాతే భూమిని స్వాధీనం చేసుకోవాలని, అప్పటివరకు ఎలాంటి కూల్చివేత లకు పాల్పడొద్దని తాజాగా హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఎంహెచ్‌నగర్ వాసుల్లో ఆనం దం వ్యక్తమవుతోంది.

కాంగ్రెస్ ప్రభుత్వమే పట్టాలు ఇచ్చింది



ఎంహెచ్‌నగర్‌లో 2003లో ఇళ్లులేని పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వమే అసైన్డ్ పట్టాలు ఇచ్చింది. పట్టాలు ఇచ్చినం దున ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నాం. ఇప్పుడు అక్రమ ణలు అంటూ కూల్చివేస్తే ఎటు పోవాలి.. ఎలా జీవించాలి. కూల్చివేయకుండా అధికార పార్టీ నాయకులు చర్యలు తీసుకోవాలి.

- గోపనబోయిన సమ్మక్క, ఎంహెచ్‌నగర్

ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చారు



అసైన్డ్ పట్టాతో పాటు ఇం దిరమ్మ ఇళ్లు మంజూరు చేయ డంతో ఇళ్లు నిర్మించుకున్నాం. కూలీ చేసుకుంటూ బతుకున్న మా ఇళ్లు కూలగొడితే ఆత్మహ త్యలే శరణ్యం. అసైన్డ్ పట్టాలు ఇచ్చినందునే కరెంటు వచ్చింది. ఇంటి పన్నులు కడుతున్నాం. ఇప్పుడు కూలుస్తామని నోటీసులు జారీ చేయడంతో ఆందోళనకు గురవుతున్నాం.

- భూక్య లక్ష్మి, ఎంహెచ్‌నగర్ బిట్-3

గంజాయి స్మగ్లర్‌పై పీడీ యాక్ట్



నిందితుడికి పీడీ యాక్ట్ ఉత్తర్వులు అందజేస్తున్న పోలీసులు

వరంగల్ క్రైం: గంజాయి స్మగ్లర్‌పై వరంగల్ పోలీస్ కమిషనర్ సోమవారం పీడీ యాక్ట్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వరంగల్ మీదుగా మహారాష్ట్రకు గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న భూపాలపల్లి జిల్లా కొత్తపల్లిగోరి ప్రాంతానికి చెం దిన గజ్జి సహదేవ్ రాజ్‌పై సీపీ జారీ చేసిన పీడీ యాక్ట్ ఉత్తర్వులను శాయంపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రంజిత్‌రావు, దామెర ఎస్సై అశోక్‌లు నిందితుడు గజ్జి సహదేవ్ రాజ్‌కు పరకాల సబ్ జైలులో అంద జేసి చర్లపల్లికి జైలుకు తరలించారు. నిందితుడు గత జూన్ 8న మరో ఇద్దరు నిందితులతో కలిసి ఆం ధ్రప్రదేశ్ నుంచి మహారాష్ట్రకు గంజాయి అక్రమ రవాణా చేస్తుండగా టాస్క్‌ఫోర్స్, దామెర పోలీసు లు సంయుక్తంగా అరెస్టు చేశారు. ఈ ముఠా నుం చి రూ.50 లక్షల విలువగల 192 కిలోల గంజాయి తోపాటు ఒక కారు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని జైలుకు తరలించారు. ఎవరైనా చట్ట వ్యతి రేక కార్యకలాపాలకు పాల్పడితే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని సీపీ హెచ్చరించారు.

వెండి గంగాళం బహూకరణ

హన్మకొండ కల్చరల్ : వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ కుటుంబసమే తంగా సోమవారం శ్రీభద్రకాళి ఆలయాన్ని సం దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి పూజల నిమిత్తం రెండు కిలోల వెండితో చేయించిన గంగాళాన్ని ఆలయ ఈఓ శేషుభారతికి అందజేశారు.



ఈఓకు వెండి గంగాళాన్ని అందజేస్తున్న వినయ్‌భాస్కర్ దంపతులు

అర్ధరాత్రి అక్రమ దందాపై సీరియస్

- మొరం తరలింపుపై సీపీ ఆరా?
- రాత్రి వేళ కాల్వలపై గస్తీకి నిర్ణయం

సాక్షి ఎఫెక్ట్

హసన్‌పర్తి : అక్రమంగా మొరం తరలిం పుపై నీటి పారుదల, పోలీస్‌శాఖలు చర్య లకు ఉపక్రమించాయి. హసన్‌పర్తి పరిధి ఎస్సారెస్పీ కాల్వల సమీపంలోని భూము ల్లోనుంచి మొరం తరలింపుపై 'అర్ధరాత్రి అక్రమ దందా' శీర్షికన సోమవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచు రితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు ఈ అక్రమ దందాపై కేయూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని నీటి పారుదలశాఖ అధికారులు నిర్ణయించారు. నేడు (మంగళ వారం) లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తామని ఆ శాఖ డీఈఈ రాజు పేర్కొన్నారు. అలాగే అర్ధరాత్రి అక్రమ మొరం దందాపై వరంగల్ పోలీస్ కమిషనర్ ఆరా తీస్తున్నట్లు తెలిసింది. ఈ వ్యవ హారంలో పోలీస్‌శాఖకు చెందిన వారి ప్రమేయం ఉందా అనే కోణంలో విచారిస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా ఎస్సా రెస్పీ కాల్వలపై రాత్రి వేళ గస్తీ నిర్వహించనున్నట్లు రాజు తెలిపారు. ఇందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేస్తామన్నారు.

'పల్లెపాటి రాధను అన్యాయంగా హత్య చేశారు'

హన్మకొండ: హైదరాబాద్ కాప్రా ప్రాంతానికి చెందిన దళిత మహిళ, మావోయిస్టు పార్టీ సభ్యురాలు పల్లెపాటి రాధను ఇన్‌ఫార్మర్ అనే ఆరోపణతో మావోయిస్టు పార్టీ శ్రేణులు హత్య చేయడం అన్యాయమని, ఈ హత్య తమను దిగ్భ్రాంతికి గురిచేసిందని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.తిరుపతయ్య, ఉభయ రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యులు ఎస్.జీవన్ కుమార్, ఎ.చంద్ర శేఖర్ తెలిపారు. ఇది మానవీయత కొరవడిన చర్యగా గర్హిస్తూ , ఈ సంఘటనను ఉభయ రాష్ట్రాల మానవ హక్కుల వేదిక తీవ్రంగా ఖండిస్తున్నట్లు వారు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మానవీయ సమాజ నిర్మాణం కోసం పనిచేస్తున్నామని చెప్పుకునే మావోయిస్టులు భవిష్య త్‌లో ఇటువంటి చర్యలకు పూనుకోవద్దని ప్రజలు, ప్రజాసంఘాలు కోరుతున్నా యని తెలిపారు.

పనుల్లో వేగం పెంచండి

నయీంనగర్ : కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనుల్లో వేగం పెంచి గడువులోగా పూర్తి చేయాలని 'కుడా' వైస్ చైర్ పర్సన్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె కళాక్షేత్రం నిర్మాణ పనుల పురోగతిని పరిశీలిం చి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాక్షేత్రం నిర్మాణం పూర్తయిందని, ఫినిషింగ్ పనులు తుదిదశకు చేరుకున్నా యన్నారు. కార్యక్రమంలో 'కుడా' ఈఈ భీంరావు, అధికారులు పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులకు వివాహిత బలి..

- జీపీ మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ మృతి
- మహబూబాబాద్ జిల్లాలో ఘటన

దోర్నకల్ : మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం అందనాలపాడుకు చెందిన ఓ వివాహిత.. అత్తింటి వేధింపులు తట్టుకోలే ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చికిత్స పొందుతూ మృతి చెందింది. దోర్నకల్ సీఐ బి.రాజేశ్ కథనం ప్రకారం.. అందనాలపాడు గ్రామానికి చెందిన కనకం మహేందర్‌కు సూర్యాపేట జిల్లా మోతె మండలం మామిళ్లగూడేనికి చెందిన మానిక(26)తో గత ఏప్రిల్ 4న వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ.10 లక్షల ఒప్పుకుని రూ.5లక్షల నగదు, ఐదు తులాల బంగారం కట్నంగా అందించారు. కొద్ది రోజుల అనంతరం అదనపు కట్నం కోసం భర్త మహేందర్, అత్త సత్యవతి, ఆడబిడ్డతో పాటు ఇతర కుటుంబ సభ్యులు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఈ నెల 22వ తేదీన మానిక పుట్టిరోజు కాగా అత్తింటివారు రూ.30 లక్షల అదనపు కట్నం తీసుకురావాలని ఇబ్బందులకు గురిచేశారు. అత్త సత్యవతి మాత్రలు మింగి చావమంటూ బీపీ మాత్రలు మానికపై విసిరింది. మానిక వాటిని తీసుకుని అధిక మోతాదులో మింగడంతో అపస్మాకర స్థితికి చేరుకుంది. కుటుంబ సభ్యులు మొదట ఖమ్మం తరలించి అనంతరం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ 25వ తేదీ (ఆదివారం) అర్ధరాత్రి మృతిచెందింది.మృతురాలి తండ్రి నవిలె కృష్ణ ఫిర్యాదు మేరకు భర్త కనకం మహేందర్, అత్త సత్యవతి, ఆడబిడ్డ స్వప్న, ఆమె భర్త తిరుపతయ్య, బంధువు గోవిందు ఏసు, ఆయన భార్య జయమ్మపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ బి.రాజేశ్ సోమవారం తెలిపారు.

ఆత్మకూరుకు చేరిన రాజేశ్ మృతదేహం

- అంత్యక్రియలు పూర్తి
- ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి, 'కుడా' చైర్మన్ వెంకట్రాంరెడ్డి నివాళి



రాజేశ్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి, కుడా చైర్మన్ వెంకట్రాంరెడ్డి

ఆత్మకూరు: మండల కేంద్రానికి చెందిన ఏరుకొండ రాజేశ్(32) ఈనెల15న అమెరికాలో అనారోగ్యంతో మృతిచెందాడు. స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి చొరవ తీసుకుని అధికారులతో మాట్లాడి రాజేశ్ మృతదేహాన్ని భారత్‌కు తెప్పించారు. సోమవారం ఉదయం శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకోగా అక్కడి నుంచి ప్రత్యేక అంబులెన్స్‌లో ఆత్మకూరుకు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.అంతకు ముందు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి.. రాజేశ్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చారు. తల్లి.. కుమారుడి కడసారి చూపునకు నోచుకుంది. కాగా స్థానికులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలిపారు.

తల్లి మందలించిందని..

- విద్యార్థిని ఆత్మహత్య

మహబూబాబాద్ రూరల్: తల్లి మందలించిందనే కారణంతో ఓ విద్యార్థిని ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మహబూబాబాద్ మండలం రోటిబండతండా జీపీ పరిధి దూదియా తండాలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై వి.దీపికారెడ్డి సోమవారం కేసు వివరాలు వెల్లడించారు. తండాకు చెందిన బానోత్ రమేశ్, జ్యోతి దంపతుల కుమార్తె నిఖిత (16) ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. ఆదివారం సెలవు కావడంతో ఇంటి వద్ద ఉండగా తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లారు. మధ్యాహ్నం భోజనం తీసుకురమ్మని చెప్పగా మరిచి ఇంటి వద్ద సెల్‌ఫోన్ చూస్తోంది. ఇంటికి వచ్చిన తల్లి భోజనం ఎందుకు తీసుకురాలేదని మందలించింది. దీంతో కొద్ది సమయం తరువాత నిఖిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

అభ్యసన అభివృద్ధే లక్ష్యం..

విద్యార్థి సామర్థ్యాల పెంపునకు 'లిప్'

- 6 నుంచి 9వ తరగతి వరకు అమలు



విద్యారణ్యపురి: సాధారణంగా ప్రతి విద్యార్థి పైతరగతిలో ప్రవేశం పొందిన సమయంలో ఆయా తరగతుల (కింది) అభ్యసన సామర్థ్యాలు కలిగి ఉండాలి. కానీ కొందరు విద్యార్థులు ఇవేమీ సాధించకుండానే పైతరగతుల్లో ప్రవేశం పొందుతున్నారు. ఈ పరిస్థితిని అధిగమించి ఆయా విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల పెంపుదలే లక్ష్యంగా రూపొందించిన 'లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్'ను హనుమకొండ జిల్లాలో అమలు చేయడానికి అధికారులు ఇటీవల ఉపక్రమించారు. ఇందులో భాగంగా రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఆదేశానుసారం ప్రభుత్వ యాజమాన్యంలోని ప్రభుత్వ, జెడ్పీ, మోడల్ స్కూల్స్, కస్తూర్బా విద్యాలయాలు, తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాలలో 6 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు 'అభ్యసన అభివృద్ధి కార్యక్రమం' (ఎల్ఐపీ) అమలు పరుస్తున్నారు. తరగతి, సబ్జెక్టు వారీగా నిర్దేశించిన అభ్యసన ఫలితాలు సాధించడానికి, నాణ్యమైన విద్య పెంపొందించడానికి 2024– 25 విద్యాసంవత్సరంలో 'లిప్' (ఎల్ఐపీ) చేపడుతున్నారు. కాగా, 2023– 24 విద్యా సంవత్సరంలోనే ఈ కార్యక్రమం అమల్లోకి వచ్చినా అమలు సాధ్యం కాలేదు. ఉపాధ్యాయులపై రికార్డుల భారం అధికంగా ఉండడంతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదురయ్యాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని 'అభ్యసన అభివృద్ధి కార్యక్రమం' సరళతరం చేసి విద్యార్థుల్లో ఆశించిన ఫలితాలు సాధించేలా ఈ విద్యాసంవత్సరంలో 'లిప్' కార్యక్రమానికి రూపకల్పన చేశారు. కాగా హనుమకొండ జిల్లాలో హైస్కూల్స్, మోడల్ స్కూల్స్, కేజీబీవీలు కలిపి మొత్తం 143 ఉన్నాయి.



హనుమకొండ జిల్లా ధర్మసాగర్‌లోని బాయ్స్ హైస్కూల్‌లో ఇటీవల విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న డీఈఓ వాసంతి (ఫైల్)

అభ్యసన అభివృద్ధికి ఉపాధ్యాయులు చేయాల్సిన అంశాలు

- ప్రతి ఉపాధ్యాయుడు విధిగా 6 నుంచి 9వ తరగతి వరకు బోధించే సబ్జెక్టుల వార్షిక ప్రణాళికలను రూపొందించుకోవాలి.
- ప్రతి ఉపాధ్యాయుడు విధిగా టీచర్ డైరీని తరగతి, పీరియడ్, సబ్జెక్ట్, పాఠ్యాంశం– ఉప భావనలు, సంబంధిత పాఠ్యాంశ బోధన ద్వారా విద్యార్థులలో సాధించే అభ్యసన ఫలితాలను(లెర్నింగ్ అవుట్ కమ్స్) పొందుపరచుకుంటూ రాయాల్సింటుంది.
- సబ్జెక్టు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ప్రతి మూడు నెలలకు ఒకసారి స్వీయ పరిశీలన పత్రం (సెల్ఫ్ అప్రైజల్) నమోదు చేసుకుని తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో పొందుపరచాలి .
- ప్రతి విద్యా సంవత్సరంలో 6 నుంచి 9వ తరగతి చదివే విద్యార్థుల అభ్యసన స్థాయిలను తెలుసుకునేందుకు ప్రతి మూడు మాసాలకు ఒకసారి పరీక్షలు నిర్వహించి స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో నమోదు చేయాలి. ఈనెలలో ప్రారంభ పరీక్ష(బేస్ లైన్), డిసెంబర్ చివరలో మధ్యంతర పరీక్ష(మిడ్‌లైన్), మార్చిలో అంత్య పరీక్ష(ఎండ్‌లైన్) నిర్వహించి విద్యార్థుల ప్రగతిని నమోదు చేయాల్సింటుంది.
- ప్రతి విషయ వారీగా నిర్దేశించిన బోధన సోపానాలు అనుసరించి బోధన చేయాలి. ఉపాధ్యాయుడు సంబంధిత తరగతికి నిర్దేశించిన కనీస సామర్థ్యాలు ప్రతి విద్యార్థి సాధించేలా బోధన పద్ధతులను (టీచింగ్ మెథడ్స్) అనుసరించొచ్చు.
- ప్రతి సబ్జెక్టు వారీగా ఈ కార్యక్రమం అమలులో సంబంధిత ఉపాధ్యాయులు అనుసరించాల్సిన విధివిధానాలను ఉత్తర్వులలో సూచించిన మేరకు అనుసరించాలి.
- ఉపాధ్యాయుడు బోధిస్తున్న సమయంలో నిర్దేశించిన పరిశీలన పత్రాలను అనుసరించి ప్రధానోపాధ్యాయులు లేదా పరిశీలనాధికారి పరిశీలించి నమోదు చేయాలి.
- ప్రస్తుతం కార్యక్రమం అమలులో సంబంధిత తరగతికి నిర్దేశించిన అభ్యసన ఫలితాలు సాధించడంతోపాటు నిర్ణీత సమయంలోగా విధిగా అన్ని తరగతుల సిలబస్ పూర్తి చేయాలి.

ఎల్ఐపీపై ప్రత్యేక శ్రద్ధ



జిల్లాలో అభ్యసన అభివృద్ధి (ఎల్ఐపీ) కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు ప్రథమ పర్యవేక్షకులుగా పరిశీలించాలి. దీనికి సంబంధించి ఇప్పటికే మార్గదర్శకాలు ప్రధానోపాధ్యాయులకు తెలిపాం. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండల నోడల్ అధికారులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలి. 6 నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులు అభ్యసన సామర్థ్యాలు సాధించడంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉపాధ్యాయులు ప్రణాళిక రూపొందించుకుని బోధన చేపట్టాలి. టీచర్ సపోర్టు గ్రూపు విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపేలా పర్యవేక్షిస్తూ జిల్లాలో అభ్యసన అభివృద్ధి కార్యక్రమాన్ని సక్రమంగా అమలు చేస్తాం.

– డి.వాసంతి, డీఈఓ, హనుమకొండ

బోధన ప్రణాళికలు అవసరం



జిల్లాలో అభ్యసన అభివృద్ధికి బోధనకు ప్రణాళికలు రూపొందించుకోవాల్సింటుంది. నిరంతరం పర్యవేక్షిస్తూ, విద్యార్థుల సామర్థ్యాల పెంపే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాం. ప్రధానోపాధ్యాయులు, మానిటరింగ్ అధికారులు స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో పర్యవేక్షణ అంశాలను పొందుపరచాలి. ఉపాధ్యాయులకు అవసరమైన మార్గనిర్దేశం ఎప్పటికప్పుడు చేస్తాం. దీనికోసం పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తాం. ఇప్పటికే జిల్లాలోని పాఠశాలల్లో ఎస్‌సీఈఆర్‌టీ రూపొందించిన ప్రశ్న పత్రాలతో బేస్ లైన్ పరీక్షలు నిర్వహించాం.

– ఏ. శ్రీనివాస్, క్వాలిటీ కోఆర్డినేటర్, హనుమకొండ

వీసీల నియామకంలో జాప్యం సరికాదు

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి మణికంఠ రెడ్డి, లక్ష్మణ్

హన్మకొండ : యూనివర్సిటీలకు వైస్ చాన్స్‌లర్ల నియామకంలో ప్రభుత్వం జాప్యం చేయడం సరికాదని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ అన్నారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మేనిఫెస్టోలో విద్యార్థులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యారంగం సమస్యలతో సతమతమవుతుందని, గురుకుల విద్యార్థుల మరణాలు బాధాకరమని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, ఎలక్ట్రిక్ స్కూటీలు, ఐదు లక్షల విద్యార్థి భరోసా కార్డులు, మండలానికో ఇంటర్ నేషనల్ పాఠశాల ఏర్పాటువంటి హామీలు అమలు చేయాలన్నారు. కాకతీయ యూనివర్సిటీ అభివృద్ధికి రూ.500కోట్లు కేటాయించాలన్నారు. రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలని, అద్దె భవనాల్లో కొనసాగుతున్న హాస్టల్‌లకు సొంత భవనాలు నిర్మించాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి ప్రణీత్, కార్యదర్శి భాష బోయిన సంతోష్, జిల్లా ఆఫీస్ బేరర్స్ రవి తేజ, సభ్యుడు పసుల వినయ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పుట్ట లక్ష్మణ్

విద్యార్థినులకు రక్షణ కల్పించాలి

హన్మకొండ : కోల్‌కతా వంటి హత్యాచార ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ దుబ్యాల శ్రీనాథ్ డిమాండ్ చేశారు. ఈమేరకు కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచార ఘటనను నిరసిస్తూ సోమవారం రాత్రి బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద ర్యాలీ నిర్వహించారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరుతూ వైద్య విద్యార్థులు ర్యాలీ చేపట్టి కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనాథ్ మాట్లాడుతూ విద్యార్థినులు, మహిళలకు ప్రభుత్వం రక్షణ కల్పించాలన్నారు. ఈ ర్యాలీకి పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కేయూ పీహెచ్‌డీ స్కాలర్ బి.నరసింహారావు పాల్గొని సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కాకతీయ మెడికల్ కళాశాల జూనియర్ డాక్టర్లు లోకేశ్, కళ్యాబ్, కావ్య, నిఖిల్, దివ్య, అష్రాఫ్, అమిత్, భవ్య, నవనీత్, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న జూడాలు

డెంగీ..112

- హైరిస్క్ జిల్లాల్లో వరంగల్‌కు పదో స్థానం

సాక్షి, వరంగల్: వరంగల్ జిల్లాలో డెంగీ డేంజర్ బెల్స్ మోగిస్తోంది. హైరిస్క్ జిల్లాల్లో రాష్ట్రంలో 1,852 కేసులతో హైదరాబాద్ తొలిస్థానంలో ఉండగా, 112 కేసులతో వరంగల్ జిల్లా పదో స్థానంలో ఉంది. వరంగల్ జిల్లాతోపాటు సమీప జిల్లాలైన హనుమకొండ, భూపాలపల్లి, ములుగు జిల్లాల నుంచి కూడా వరంగల్‌లోని మహాత్మాగాంధీ మెమోరియల్ (ఎంజీఎం) ఆస్పత్రికి వచ్చిన జ్వరపీడితులకు ఈ డెంగీ నిర్ధారణ అవుతోంది. నగరంలో మురికివాడ ప్రాంతాలు ఎక్కువగా ఉండడం.. దోమల వృద్ధికి అవకాశం ఎక్కువగా ఉండడంతో అక్కడినుంచి వచ్చే రోగులు ఎక్కువ ఉంటున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు ఎంజీఎంకు వచ్చిన అవుట్ పేషంట్ విభాగంలో జ్వరపీడితుల నుంచి 1,792 శాంపిల్స్ సేకరించి ఎలిసా (ఎంజైమ్ లింక్‌డ్ ఇమ్యూనోసార్బెంట్ అస్సే) ఎన్ఎస్1, ఎలిసా ఐజీఎం పరీక్షలు చేస్తే 112 కేసులు డెంగీగా నిర్ధారణ అయినట్లు జిల్లా వైద్యాధికారులు తెలిపారు.

వివాదంలో వరంగల్ పోలీసులు?

సాక్షి, వరంగల్: వరంగల్ పోలీసులు వివాదాలకు కేంద్రం అవుతున్నారు. ఇప్పటికే మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకల్లో ఏసీపీ నందిరాం నాయక్ విధుల్లో ఉన్న సమయంలో పాల్గొన్న వివాదం ఉండగానే...ఇప్పుడు ఓ మొక్కు చెల్లించుకునేందుకు స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని శ్రీపతిపల్లికి వెళ్లిన మాజీ ఎమ్మెల్సీ కొండా మురళికి ఎస్కార్ట్‌గా వరంగల్ సబ్ డివిజన్ పోలీసులు వెళ్లారన్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. స్థానికంగా ఉన్న సమస్యలను పోలీసులు గాలికొదిలేసి అక్కడికెళ్లడం ఏంటని, అక్కడి పోలీసులు ఎస్కార్ట్‌గా వ్యవహరించొచ్చు కదా అన్న కామెంట్లతో సోషల్ మీడియా వేదికగా ఆ పోలీసులు కొండా మురళీతో ఉన్న ఫొటోలు వైరల్ చేశారు. ఈ విషయంపై ఓ పోలీసు అధికారిని వివరణ కోరగా వింటుకు వెళ్లినట్లు సమాచారం ఉందని తెలిపారు.

అప్పుల బాధతో వ్యాపారి ఆత్మహత్య

- కమలాపూర్‌లో ఘటన



కార్తీక్ (ఫైల్)

కమలాపూర్ : అప్పుల బాధ తట్టుకోలేక ఓ సూపర్ మార్కెట్ నిర్వాహకుడు(వ్యాపారి) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కమలాపూర్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సుద్దాల కార్తీక్ (34) బస్టాండ్ దగ్గర సూపర్ మార్కెట్ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో కార్తీక్ ఇటీవల సరిగా నిద్రపోకుండా చికాకుగా ఉండడాన్ని అతడి భార్య అర్చన గమనించింది. ఎందుకు ఇలా ఉంటున్నావని ఆరా తీసింది. దీంతో కొద్ది రోజులుగా సూపర్ మార్కెట్ సరిగా నడవడం లేదని, దాదాపు రూ.35లక్షల వరకు అప్పులు అయ్యాయని చెప్పాడు. ఆదివారం రాత్రి సైతం అప్పులు తీర్చలేక ఇబ్బంది పడుతున్నానని చెప్పాడు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున బాత్రూం కోసమని బయటకు వెళ్లాడు. ఆ తర్వాత స్థానికులు వచ్చి కార్తీక్ ఉరేసుకున్నాడని చెప్పగా భార్య వెళ్లి చూసేసరికి అప్పటికే మృతిచెంది ఉన్నాడు. ఈ ఘటనపై మృతుడి భార్య అర్చన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపారు.

మహిళ ఆత్మహత్య

రామన్నపేట : ఆర్థిక ఇబ్బందులు, ఇంట్లో గొడవలతో మనస్తాపానికి గురైన ఓ మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన ఇంతేజార్‌గంజ్ పీఎస్ పరిధిలోని కాశిబుగ్గలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్ కథనం ప్రకారం.. రూసపల్లి విజయ (42)కు సుమారు 28 సంవత్సరాల క్రితం కాశిబుగ్గకు చెందిన చేరాలుతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొన్ని సంవత్సరాల నుంచి ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఈనెల 19న ఉదయం భర్తతో గొడవ పడిన విజయ.. మధ్యాహ్నం 12 గంటల సమయంలో జీవితంపై విరక్తి చెంది గడ్డిమందు తాగింది. గమనించిన కుటుంబీకులు వెంటనే ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు మృతిచెందింది. మృతురాలి సోదరుడు కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్ సోమవారం తెలిపారు.

దేవాదుల పంపింగ్ ప్రారంభం ..



కొనసాగుతున్న పంపింగ్

కన్నాయిగూడెం: ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని గట్టలగంగారం వద్ద గోదావరిపై ఉన్న దేవాదుల ఎత్తిపోతల పథకం పంపింగ్ సోమవారం షురూ అయింది. ఆదివారం నిలిపివేసిన పంపింగ్ సోమవారం ఫేజ్ త్రీలోని రెండు మోటార్లతో ప్రారంభించినట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. రెండు మోటార్లతో 583 క్యూసెక్కుల నీరును పంపింగ్ చేస్తున్నట్లు తెలిపారు.

పాలకుల అండతోనే భూకబ్జాలు

- బీఎల్ఎఫ్ రాష్ట్ర చైర్మన్ నల్ల సూర్యప్రకాశ్



మాట్లాడుతున్న బీఎల్ఎఫ్ రాష్ట్ర చైర్మన్ నల్ల సూర్య ప్రకాశ్

వరంగల్ చౌరస్తా : పేదలకు చెందాల్సిన వివిధ రకాల ప్రభుత్వ భూములు పాలకుల కనుసన్నల్లోనే కబ్జాలకు గురవుతున్నాయని, పోరాటాలతోనే పేదలు హక్కులు సాధించుకోవాలని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) రాష్ట్ర చైర్మన్ నల్లా సూర్య ప్రకాశ్ పిలుపునిచ్చారు. సోమవారం బీఎల్ఎఫ్ ఆధ్వర్యంలో వరంగల్ ఉమ్మడి జిల్లా సదస్సు జిల్లా కన్వీనర్ నర్ర ప్రతాప్ అధ్యక్షతన వరంగల్ అండర్ బ్రిడ్జి ఓంకార్ భవన్‌లో జరిగింది. ఈ సదస్సుకు నల్ల సూర్య ప్రకాశ్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ నాడు రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడి భూములను సాధించుకుంటే నేడు కూడా స్వరాష్ట్ర పాలనలో భూమికోసం మరోసారి పోరాడాల్సిన దుస్థితి నెలకొనడం సిగ్గుచేటన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు అధిక శాతం భూమిలేకుండా శ్రమజీవులుగా కనీస సౌకర్యాలు అందని సామాజిక తరగతులుగా జీవిస్తున్నారని పేర్కొన్నారు. అందుకు ప్రధాన కారణం అగ్ర వర్ణ కుల పాలకుల విధానాలే అన్నారు. ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి మాట్లాడుతూ పేదలకు భూములు దక్కేలా కార్యకర్తలకు నిజాయితీగా పోరాడాలని పేర్కొన్నారు. ఆ దిశలో రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సదస్సులో ఎంసీపీఐ(యూ) పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు వల్లెపు ఉపేందర్ రెడ్డి, కేంద్ర కమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి, వరంగల్ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్, హనుమకొండ జిల్లా కార్యదర్శి ఎన్ రెడ్డి హంసారెడ్డి, ములుగు జిల్లా కార్యదర్శి గుండె బోయిన చంద్రయ్య, బీఎల్ఎఫ్ రాష్ట్ర నాయకులు మారోజు సునీల్, వంగల రాగసుధ, నీల రవీందర్ కుసుంబ బాబూరావు, కనకం సంధ్య, కన్నం వెంకన్న, సోమిడి శ్రీనివాస్, గడ్డం నాగార్జున, నాగెల్లి కొమురయ్య , సుంచు జగదీశ్వర్, ఐతమ్ నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

దారి దోపిడీ దొంగ అరెస్ట్

- వ్యక్తిని కత్తితో బెదిరించి రూ.10 వేలు అపహరణ
- వివరాలు వెల్లడించిన ఏసీపీ నందిరాంనాయక్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఏసీపీ నందిరాంనాయక్

రామన్నపేట : కత్తితో బెదిరించి ఓ వ్యక్తి నుంచి రూ.10 వేలు అపహరించిన దారి దోపిడీ దొంగను అరెస్ట్ చేసినట్లు వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ తెలిపారు. ఏసీపీ కథనం ప్రకారం.. ఈనెల 24న రంగశాయిపేటకు చెందిన ఎండీ షారూక్ నగరంలోని ఎస్సారెస్పీ కెనాల్ సమీపంలోని డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద ఓ వ్యక్తిని కత్తితో బెదిరించి అతడి వద్ద నుంచి రూ.10 వేల నగదు లాక్కొని పరారయ్యాడు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసిన మట్టెవాడ పోలీసులు నిందితుడు ఎండీ షారూక్‌ను సోమవారం అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి రూ.వెయ్యి, కత్తి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. షారూక్ పై రౌడీషీట్ ఓపెన్ చేస్తామని ఏసీపీ వివరించారు. కాగా, నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి, ఎస్సైలు నవీన్, సాంబయ్య, సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

నకిలీ పురుగుల మందుతో పంట మాడింది

- యజమానిపై చర్యలు తీసుకోవాలి
- పలువురి రైతుల డిమాండ్
- పెద్దతండాలోని యాకూబ్‌షావలి ఆగ్రో ఏజెన్సీస్ వద్ద ఆందోళన



ఫర్టిలైజర్ షాపు ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

పర్వతగిరి: నకిలీ పురుగుల మందు అమ్మిన యజమానిపై చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. పత్తిపై పురుగుల మందు పిచికారీ చేయడంతో పంట పాడైపోయిందని ఆరోపిస్తూ మండలంలోని పెద్దతండాకు చెందిన 15 మంది రైతులు సోమవారం ఇదే తండాకు చెందిన యాకూబ్‌షావలి ఆగ్రో ఏజెన్సీస్, ఫర్టిలైజర్స్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సదరు షాపులో టి–ఫ్లవర్ కంపెనీకి చెందిన బయో కెమికల్ మందులు కొనుగోలు చేసి వారం క్రితం పంటపై పిచికారీ చేశామన్నారు. 45 ఎకరాల పత్తి పంటకు మందు పిచికారీ చేయగా ఆకులు, కాయలు మాడిపోయాయని, కొత్తగా పిందెలు రావడం లేదని వాపోయారు. ఈ ఘటనపై అధికారులు స్పందించి నకిలీ పురుగుల మందులు అమ్మిన యజమానిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పురుగుల మందు తాగిన మహిళా రైతు..

ఈ ఘటనపై పెద్దతండాకు చెందిన లూనావత్ సునీత పురుగుల మందు తాగి చికిత్స పొందుతోంది. 'నాకున్న ఐదెకరాల పత్తి పంటపై టి–ఫ్లవర్ పురుగుల పిచికారీ చేశా. మందు పని చేయలేదు. రూ.2లక్షలు అప్పు తెచ్చి పెట్టుబడి పెట్టా. పంట దిగుబడి రాలేదు' అని కన్నీరుమున్నీరైంది. కాగా, సదరు రైతులు పోలీస్‌స్టేషన్, ఏఓ కార్యాలయంలో యాకుబ్‌షావలి ఫర్టిలైజర్ షాపుపై ఫిర్యాదు చేశారు.

భగవద్గీత జీవన విధానం తెలుపుతుంది

- వరంగల్ ఎంపీ కడియం కావ్య



మాట్లాడుతున్న ఎంపీ కడియం కావ్య

హన్మకొండ కల్చరల్ /కాజీపేట అర్బన్: భగవద్గీత జీవన విధానం తెలుపుతుందని, కష్టాలు ఎదుర్కోవడం నేర్పుతుందని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. యాదవ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గొల్ల, కురుమ సంస్కృతిక వేడుకల్లో భాగంగా సోమవారం సాయంత్రం 5 నుంచి రాత్రి 12గంటల వరకు హనుమకొండ హంటర్‌రోడ్‌లోని 'డి' కన్వెన్షన్ హాల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. యాదవ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్, మాజీ 'కుడా' చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీ కడియం కావ్య, హనుమకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, బీజేపీ స్టేట్ జనరల్ సెక్రటరీ కాసం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ కావ్య మాట్లాడుతూ పూర్వీకులు మనకు అందించిన సంస్కృతిని భవిష్యత్ తరాలకు అందించాలన్నారు. హనుమకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ యాదవుల ఐక్యత కోరుతూ ఇలాంటి మంచి కార్యక్రమం ఏర్పాటు చేసిన సుందర్‌రాజ్ అభినందనీయుడన్నారు. బీజేపీ స్టేట్ జనరల్ సెక్రటరీ కాసం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రపంచమంతా వసుధైక కుటుంబమని తెలియజేసిన దేవుడు శ్రీకృష్ణుడన్నారు. యాదవ కుల బంధువులలో శ్రీకృష్ణ తత్వం, భక్తి మార్గం పెంపొందించడానికి శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నామని సుందర్‌రాజ్ యాదవ్ అన్నారు. కార్యక్రమంలో సినీ గేయ రచయిత వరంగల్ శ్రీనివాస్, తుత్తురు రవియాదవ్, సిద్దిరాజ్‌యాదవ్, కెంచ కుమారస్వామి యాదవ్, బండి పర్వతాలు యాదవ్, బూరం ప్రశాంత్ యాదవ్, ఉడుత తిరుపతి యాదవ్, బోయిన భిక్షపతి యాదవ్, శ్యామ్‌యాదవ్, సహదేవ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

మాతం ప్రదర్శనలో షియా ముస్లింలు



భక్తిశ్రద్ధలతో అర్బయీన్

వరంగల్ నగరంలోని షియా ముస్లింలు భక్తిశ్రద్ధలతో సోమవారం అర్బయీన్ జరుపుకున్నారు. మహ్మద్ ప్రవక్త మనుమడు ఇస్లాం పరిరక్షణలో యజీద్ అనే దుశ్శాసనుడి చేతిలో తన 72 మంది అనుచరులతో ప్రాణ త్యాగం చేశారని, వారి త్యాగాన్ని స్మరించుకుంటూ మాతం చేస్తూ తమ సంఘీభావాన్ని ప్రకటించినట్లు మలాలి కాపువాడ ముజావర్ అలీ హుస్సేన్ తెలిపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, హనుమకొండ

కాళేశ్వరంలో గోదావరి నీటిమట్టం



ప్రాణహిత పరవళ్లు..

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం పెరుగుతోంది. మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాల వల్ల సోమవారం ప్రాణహిత నది వరద కాళేశ్వరం వద్ద పరవళ్లు తొక్కుతోంది. కాళేశ్వరం వద్ద గోదావరితో కలిసి 8.200 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది.